సాక్షి చిత్తూరు

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా'

చిత్తూరు మెసానికల్ మైదానంలో శనివారం జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ఘనంగా ముగిశాయి. - 8లో



పక్కాగా ఉద్యోగుల వివరాలు

జిల్లాలోని ప్రభుత్వోద్యోగుల వివరాలను పక్కాగా సేకరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 8లో



ఎస్పీ రిశాంత్‌రెడ్డికి వీడ్కోలు

చిత్తూరు ఎస్పీగా పనిచేసి బదిలీపై వెళుతున్న రిశాంత్‌రెడ్డికి జిల్లా పోలీస్‌శాఖ శనివారం ఘనంగా వీడ్కోలు పలికింది. - 8లో

న్యూస్‌రీల్

టీటీడీకి పది టన్నుల కూరగాయలు



కూరగాయల వాహనంతో భక్తులు

పలమనేరు:పట్టణానికి చెందిన శ్రీవారి భక్తులు ఆధ్వర్యంలో కర్ణాటకలోని మాలూరుకు చెందిన యుగంధర్ రెడ్డి అనే దాత ద్వారా సేకరించిన పది టన్నుల కూరగాయలను టీటీడీ వితరణగా అందించారు. శనివారం ఈ మేరకు ప్రత్యేక వాహనంలో తిరుమలకు తరలించారు. ముందుగా వాహనానికి పూజలు నిర్వహించి, గోవింద నామస్మరణల నడుమ సాగనంపారు. కార్యక్రమంలో కాప్పల్లి రవీంద్రారెడ్డి, సోమశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు ఎస్పీ జాషువా బాధ్యతల స్వీకరణ



చిత్తూరు అర్బన్: నూతన ఎస్పీ పి.జాషువా ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న రిషాంత్‌రెడ్డి తిరుపతి ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగం ఇన్‌చార్జితోపాటు కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కృష్ణా జిల్లా నుంచి జాషువా జిల్లాకు రానున్నారు.

వరసిద్ధుని గ్రంథానికి విశేష పూజలు



గ్రంథం తీసుకువస్తున్న మోహన్ రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి వైభవం, ఉపాసన విధానాలపై ముద్రించిన గ్రంథం తొలి ప్రతికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు అందించారు. ఈ గ్రంథాన్ని త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసురానున్నట్లు మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



ఆస్థాన మండపంలోని పీఠాధిపతుల ధార్మిక సమావేశం



శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి వారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు, సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

ధార్మిక సదస్సు.. ఆధ్యాత్మిక ఉషస్సు

తిరుమలలో శనివారం జరిగిన ధార్మిక సదస్సు భక్తుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. స్వామీజీల అనుగ్రహ భాషణం టీటీడీకి దిక్సూచిలా మారింది. సనాతన ధర్మం యువతను సన్మార్గం వైపు నడపాలని సూచించింది. హిందూ ధర్మప్రచార వ్యాప్తికి దిశానిర్దేశం చేసింది. భవిష్యత్‌లో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టే విధంగా ప్రణాళికలు రచించింది. దీనిపై సర్వత్రాహర్షం వ్యక్తమవుతోంది.

ఏడు కొండలవాడి చెంత మార్మోగిన వేద ఘోష

- హిందూ సనాతన ధర్మ పరిరక్షణకు టీటీడీ సేవలు అభినందనీయం
- అనుగ్రహభాషణంలో స్వామీజీల ఉద్ఘాటన

తిరుమల: తిరుమల శ్రీవారి ఆస్థాన మండపంలో టీటీడీ నిర్వహిస్తున్న మూడు రోజుల ధార్మిక సదస్సులో మొదటి రోజైన శనివారం పలు ప్రాంతాల నుంచి 25 మంది స్వామీజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీలు అనుగ్రహ భాషణం చేస్తూ సనాతన హైందవ ధర్మ పరిరక్షణలో టీటీడీ ముందంజలో ఉందని, భవిష్యత్తులోనూ దీన్ని కొనసాగిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ధార్మిక ఉత్సాహం

స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ టీటీడీ కార్యక్రమాలు యువతలో ధార్మిక ఉత్సాహాన్ని నింపి సన్మార్గం వైపు నడిపిస్తున్నాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో టీటీడీపై వస్తున్న అవాస్తవాలతో కూడిన విమర్శలను ఎస్వీబీసీ ధార్మిక కార్యక్రమాల ద్వారా టీటీడీ విజయవంతంగా తిప్పి కొడుతోందని తెలిపారు. గోసంరక్షణ కార్యక్రమాలు చక్కగా ఉన్నాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తన అధికారిక నివాసంలో గోశాలలను నిర్మించడం అభినందనీయమని వెల్లడించారు. ధార్మిక కార్యక్రమాలకు కూడా టీటీడీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించాలని సూచించారు

ధ్యాన మందిరాలు ఏర్పాటు చేయాలి

దేవనాథ రామానుజ జీయర్ స్వామీజీ మాట్లాడుతూ.. తిరుమల దివ్యక్షేత్రంలో ధ్యాన మందిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్వీబీసీ యూట్యూబ్ చానల్ ద్వారా ధార్మిక కార్యక్రమాలను సమాజంలోకి తీసుకెళ్లాలని సూచించారు.

అభినందిస్తున్నా

శుశ్రుతానంద మాతాజీ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మప్రచారం కోసం మరిన్ని ధార్మిక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు టీటీడీ చైర్మన్, ఈవోల నిబద్ధత, అంకితభావాన్ని అభినందిస్తున్నాం. ఈ కార్యక్రమాలు ప్రతి మూలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నా.

హిందూ ధర్మపరిరక్షణలో టీటీడీ ముందంజ

విద్యాశ్రీశతీర్థ స్వామి మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, వ్యాప్తిలో టీటీడీ దేశంలోనే ముందుంది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని అభినందిస్తున్నా. హిందూధర్మ ప్రచారానికి ఆయన గతంలోను, ప్రస్తుతం అంకితభావంతో సేవలందిస్తున్నారు. అదేవిధంగా అఖండ సుందరకాండ, గీతాపారాయణం మొదలైన పారాయణాలతో యువతలో భక్తిని పునరుజ్జీవింపజేసేందుకు టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి కృషి చేస్తున్నారు.

ధార్మిక విషయాలు జోడించాలి

శివ దర్శనం మాతాజీ మాట్లాడుతూ.. సమాజంలో శత్రుత్వాలు, ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ప్రతిఒక్కరిలో సనాతన హిందూ భావాలను బయటకు తీసుకురావడానికి ధార్మిక కార్యక్రమాలు చాలా అవసరం. పాఠశాల, కళాశాల స్థాయిలో సిలబస్‌లో ధార్మిక విషయాలను జోడించాలి. గతంలో శుభప్రదం నిర్వహించేవారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు దీన్ని పునఃప్రారంభించాలి.

శ్రీవారి సేవా కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. స్వరూపానందగిరి స్వామి మాట్లాడుతూ తిరుమల తరహాలో గోవింద నామ స్మరణను తిరుపతి, శ్రీనివాస మంగాపురం, తిరుచానూరు, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల్లో వినిపించాలని సూచించారు.

ద్రవిడ వేదాన్ని ప్రోత్సహించాలి

రామచంద్ర రామానుజ జీయర్ మాట్లాడుతూ టీటీడీ ద్రావిడ వేదాన్ని కూడా ప్రోత్సహించాలన్నారు. విశ్వయోగి విశ్వంజీ మాట్లాడుతూ తిరుమల నుంచి సనాతన ధర్మ విశిష్టతను ప్రపంచానికి చాటేలా టీటీడీ కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు.



విద్యుద్దీపాలతో స్వామివారి కిరీటం



పూల అలంకరణలో స్వామివారి రూపాలు



గజరాజు, అశ్వాల ప్రతిమలు



లేగ దూడతో గోమాత బొమ్మ

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 58,842 మంది స్వామివారిని దర్శించుకోగా, 21,796 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

డిప్లొమా కోర్సుతో ఉద్యోగోన్నతి



కోర్సుకు ఎంపికైన ఉద్యోగులు

పూతలపట్టు: మండలంలోని పేటమిట్టలో ఉన్న అమరరాజాలో ఉద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కింద డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చి ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నట్లు అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ కంపెనీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ నరసింహులు నాయుడు తెలిపారు. శనివారం పేటమిట్ట బ్రాంచ్‌లో పనిచేస్తున్న 50 మంది మిషన్ ఆపరేటర్లను డిప్లొమా కోర్సులో చేర్పించినట్లు వెల్లడించారు. వీరికి రెండేళ్లలో నాలుగు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సూపర్‌వైజర్లుగా ప్రమోషన్ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ నళిని, సతీష్, రవికుమార్, సునీల్, పీఆర్‌ఓ బాబ్జీ పాల్గొన్నారు.

పెత్తందార్లపై యుద్ధానికి సంసిద్ధం



వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం : సంక్షేమ పథకాలు అందకుండా చేసి పేదల కడుపు కొట్టేందుకు వస్తున్న పెత్తందార్లపై యుద్ధానికి సంసిద్ధం కావాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. శనివారం వెదురుకుప్పంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ టీడీపీ, జనసేన తమ అనుకూల మీడియా ద్వారా కుట్రపూరితంగా అసత్య ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకునేందుకు కుతంత్రాలు పన్నుతున్నారని విమర్శించారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఇంగ్లిష్ మీడియంలో బోధన అందిస్తుంటే ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. ఆడపడుచులకు 32 లక్షల ఇంటి స్థలాలు మంజూరు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న చేయూత ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు ఏటి రూ.18,750 అందిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ఉన్నత భవిత కోసం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు పేదల గురించి ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు మళ్లీ మోసం చేసేందుకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. జగనన్న సైనికులుగా ఎన్నికల్లో కృషి చేసి టీడీపీని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శిల్ప, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జగనన్న తోడుగా పేదలకు సేవ

కార్వేటినగరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పేదలకు సేవలందిస్తానని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శనివారం కార్వేటినగరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ భవిష్యత్‌ను ప్రసాదించి, ఉన్నత పదవులు అందించి ఆదరిస్తున్న జగనన్న రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. రాజకీయంగా తొలుత తనకు గుర్తింపు తీసుకువచ్చింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని, వైఎస్ కుటుంబం వెంటే ఎల్లప్పుడూ ముందుకు సాగుతానని వెల్లడించారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తున్నట్లు వివరించారు. జీడీ నెల్లూరు నియోజకవర్గాన్ని ఇప్పటికే 90శాతం అభివృద్ధి చేశామని, 2024 ఎన్నికల తర్వాత మరింతగా పురోభివృద్ధి బాటలో నడిపిస్తామని తెలిపారు. తనకు అన్ని విధాలుగా సహకరిస్తున్న పార్టీ పెద్దలకు కృతజ్ఞతలన్నారు. సమస్యలు లేని నియోజకవర్గంగా జీడీ నెల్లూరును తీర్చిదిద్ది జగనన్నకు అంకితం చేస్తానని స్పష్టం చేశారు. ప్రతి ఎన్నికల్లో ఆదరిస్తున్న ఓటర్లే తనకు దేవుళ్లని చెప్పారు. జగనన్న స్ఫూర్తితో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామిని వైఎస్సార్‌సీపీ నేతలు గజమాలతో సత్కరించారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, పార్టీ జిల్లా కార్యదర్శి బాలాజీ, స్థానిక నేత పట్టాభిరెడ్డి పాల్గొన్నారు.

తమ్ముళ్లకే మళ్లీ పచ్చ కండువాలు!


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైఎస్సార్‌సీపీ నేతలు

నగరి : టీడీపీ కార్యకర్తలకే పచ్చ కండువాలు కప్పుతూ వైఎస్సార్‌సీపీ నుంచి వలస వచ్చారంటూ తెలుగుదేశం నేతలు నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటున్నారని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ఆరోపించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ నేతలు వార్డుల్లో పర్యటిస్తుంటే జనం పట్టించుకోవడం లేదని, దీంతో తమ పార్టీకి చెందిన వంద మందికి పసుపు కండువాలు వేసి తాము బలోపేతమైనట్లు కలరింగ్ ఇస్తున్నారని విమర్శించారు. గతంలోనూ ఇదే తరహాలో వ్యవహరించారని, టీడీపీ నేతల అవస్థలు చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీలో చేరారని చెప్పుకుంటున్నవారు ఎవరో పేర్లతో సహా తమకు తెలుసని స్పష్టం చేశారు. చివరకు ఓటు హక్కులేని మైనర్లకు సైతం కండువాల కప్పే దుస్థితిలో టీడీపీ ఉందని ఆరోపించారు. ఇలాంటి జిమ్మిక్కులను ప్రజలు నమ్మరని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్ మోహన్‌రాజ్, భూబాలన్, పుదుపేట వైఎస్సార్‌సీపీ నాయకులు ఇళంగో, రమేష్, సతీష్, లోకనాథం, శశికుమార్, దినేష్, పాండు పాల్గొన్నారు.

బస్సు బోల్తా : ఇద్దరికి గాయాలు


బోల్తా పడిన బస్సును పరిశీలిస్తున్న స్థానికులు

కుప్పంరూరల్ : కుప్పం డిపో బస్సు శనివారం తమిళనాడులోని కనుమూరు వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. ఉదయం 5.30 గంటలకు కుప్పం నుంచి ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో తమిళనాడులోని బరుగూరుకు బయలుదేరింది. మార్గం మధ్యలో మలుపు వద్ద మంచు కారణంగా రోడ్డు కనిపించక బస్సు అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. స్థానికుల సాయంతో ప్రయాణికులు బయటపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న కుప్పం డిపో మేనేజర్ పెంచులయ్య ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ జయకుమార్, ప్రయాణికులను పరామర్శించారు. అందరూ సురక్షింతంగా ఉన్నారని, ఇద్దరికి మాత్రమే చిన్నపాటి గాయాలైనట్లు పెంచులయ్య వెల్లడించారు.

చెరువులో పడి జింక మృతి


చెరువులో జింక కళేబరం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గంగినేని చెరువులో శనివారం ఓ జింక పడి మృతి చెందింది. ఎఫ్ఆర్ఓ థామస్ మాట్లాడుతూ కుక్కల దాడిలో గాయపడిన జింక చెరువులో పడిపోవడంతో మరణించినట్లు వెల్లడించారు. కళేబరానికి పంచనామా నిర్వహించనున్నట్లు వివరించారు.

ముగిసిన జిల్లాస్థాయి 'ఆడుదాం ఆంధ్రా'

- విజేతలకు ట్రోఫీలు, నగదు, సర్టిఫికెట్ల పంపిణీ
- రాష్ట్రస్థాయికి చేరిన పది జట్లు


బహుమతులు అందుకున్న జట్లతో అధికారులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని మెసానికల్ మైదానంలో శనివారం ఘనంగా జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, విదేశీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆడుదాం ఆంధ్ర పోటీలను పకడ్బందీగా నిర్వహించినట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన పది జట్లు ఉత్తమ ప్రతిభను కనబరచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ నెల 7వ తేదీన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్లనున్నట్లు వివరించారు. వైజాగ్‌లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయన్నారు. జ్ఞానేం


ఫొటోలు తీసుకుంటున్న క్రీడాకారులు

ద్రరెడ్డి మాట్లాడుతూ యువకుల్లో క్రీడా స్ఫూర్తి నింపేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను వెలికితీసి, ఉత్తమంగా రాణించేలా ప్రోత్సహించడమే ఆడుదాం ఆంధ్రా లక్ష్యమన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజనల్ చైర్‌పర్సన్ శైలజా మాట్లాడుతూ గ్రామీణక్రీడాకారులకు ఈ పోటీలు చక్కటి వేదికగా మారాయని చెప్పారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడల్లో జిల్లా స్థాయి విజేత జట్లకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మహిళా స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి, ఆర్డీఓ చిన్నయ్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, పీడీలు బాబు, రవీంద్రరెడ్డి, పాండ్యన్, పీఈటీ శరత్ పాల్గొన్నారు.

ఎస్పీ రిశాంత్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు


రిశాంత్‌రెడ్డిపై పూలవాన కురిపిస్తున్న సిబ్బంది


తాడు లాగుతూ ఎస్పీ రిశాంత్‌రెడ్డిని ఊరేగిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎస్పీగా పనిచేసి బదిలీపై వెళుతున్న వై.రిశాంత్‌రెడ్డికి జిల్లా పోలీసుశాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. ఆయకు శనివారం పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఆర్ముడు రిజర్వు విభాగం గౌరవ పరేడ్ నిర్వహించి, కవాతు వందనం సమర్పించింది. ఎస్పీని జీపులో నిల్చోపెట్టి తాడు లాగుతూ ఊరేగించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇక్కడ జిల్లా యంత్రాంగం తనకు పూర్తిగా సహకరించిందన్నారు. పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలున్న రిశాంత్‌రెడ్డి ఏ ప్రాంతంలో పనిచేసిన తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారన్నారు. ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, బాబుప్రసాద్, విష్ణురఘువీర్, శ్రావణ్‌కుమార్, మురళీధర్, ఇలియాజ్‌భాష, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరు డీఎస్పీకి వీడ్కోలు

చిత్తూరు డీఎస్పీగా పనిచేసి బదిలీపై వెళుతున్న శ్రీనివాసమూర్తికి పోలీసు అధికారులు వీడ్కోలు పలికారు. ఈయన్ను రాజమహేంద్రవరానికి బదిలీచేయగా, చిత్తూరు సబ్–డివిజన్‌లోని పోలీసులు శ్రీనివాసమూర్తిని సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. ఈయన స్థానంలో నాయుడుపేటలో పనిచేస్తున్న రాజగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో గంజాయి విక్రేతలపై సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తిరుపతి రూరల్ సెబ్ సీఐ భీమలింగం ఆధ్వర్యంలో అధికారులు శనివారం తిరుచానూరు గ్రామ చివారులో దాడులు నిర్వహించారు. శివజ్యోతీనగర్‌కు చెందిన చెరుకూరి రాజు, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన శివాల నవీన్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా తేజా అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు అంగీకరించారు. నిందితులు రాజు, నవీన్‌లను కోర్టులో హాజరుపరగా.. జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో తిరుపతి రూరల్ సెబ్ స్టేషన్ అధికారులు రవి, చిరంజీవి, అశోక్, మహేష్ పాల్గొన్నారు.

పార్టీలో చేరినవారితో విజయానందరెడ్డి



వైఎస్సార్‌సీపీలోకి జనసేన నేతలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని షావుకారుపేటకు చెందిన 40 మంది జనసేన నేతలు వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. వారికి చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు నేతలు తెలిపారు. పార్టీలో చేరినవారిలో రోషన్, రోనాక్, షోయాల్, అల్లాబక్షు, నిజాం, మురాద్‌ఆలీ, ముబారక్, మురాద్‌షా, పండు తదితరులు ఉన్నారు.

పార్టీలో చేరిన సుద్దల కుప్పంవాసులు

వి.కోట: మండలంలోని సుద్దల కుప్పం గ్రామానికి చెందిన దాము, నాగరాజు, దిలీప్‌కుమార్ ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. శుక్రవారం వీరికి మాయమాటలు చెప్పి మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి చేరినట్లు ప్రచారం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ సదరు నేతలను పిలిపించి మాట్లాడారు. టీడీపీ వారి కల్లబొల్లి కబుర్లకు మోసపోయామని, అందుకు చింతిస్తున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, పార్టీ మండల కన్వీనర్ బాల గురునాథ్ పాల్గొన్నారు.


పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పక్కాగా ఉద్యోగుల వివరాలు సేకరణ


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి వివరాలను పక్కాగా సేకరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ లోపు సీఎఫ్ఎంఎస్ పద్ధతిలో జీతాలు పొందే ఉద్యోగుల వివరాలు కలెక్టరేట్‌కు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రొఫార్మాను ఖజానా శాఖ నుంచి ప్రతి జిల్లా కార్యాలయానికి పంపినట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి అధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు వివరాలను ప్రొఫార్మాలో పేర్కొనాలని కోరారు. ఉద్యోగి సొంత జిల్లా, నియోజకవర్గం, మండలం తదితర వివరాలతోపాటు, సీఎఫ్ఎంఎస్ నంబర్, పేస్కేల్, బేసిక్, గత ఎన్నికల్లో విధులు నిర్వహించి ఉంటే ఆ సమాచారాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. శాఖల వారీగా వివరాలను సోమవారం నుంచి కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో అప్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్ఓ రాజశేఖర్, పలు శాఖల జిల్లా అధికారులు పద్మనాభం, తులసి, గంగాభవానీ, రాజ్యలక్ష్మి, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.